భవన కార్మికుల ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అవగాహన కల్పిస్తున్న న్యాక్ ఏడీ ప్రభాకర్

కోటగిరి, సెప్టెంబర్ 6 : భవన కార్మికుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని న్యాక్ ఏడీ ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని రచ్చ గల్లీలో కొనసాగుతున్న భవన కార్మికుల ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. కార్మికులు పనిచేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాక్ శిక్షకులు అంజయ్య, ప్రదీప్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో లక్కీడ్రా

లక్కీడ్రా తీస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 6 : నిజామాబాద్ -వరంగల్ రూట్‌లో ప్రవేశపెట్టిన డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టారు. 15 రోజులకోకసారి గిఫ్ట్ బాక్స్ నుంచి డ్రా తీసి ముగ్గురు మహిళా ప్రయాణికులకు బహుమతులు ఉందజేస్తున్నట్లు డిపో అధికారులు తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ కార్యాలయంలో ఆగస్టు 16 నుంచి 31వ తేదీ వరకు ప్రయాణించిన వారి లక్కీడ్రాను శుక్రవారం తీశారు. రవళిక (నిజామాబాద్), సావిత్రి (నిజామాబాద్), జ్యోతి (జగిత్యాల్) విజేతలుగా నిలిచారు. వీరికి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ -నిజామాబాద్ వారి సహకారంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 6 : నగర శివారులోని అర్సపల్లి ప్రాంతంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. బోధన్‌కు చెందిన గౌస్ (60) టీవీఎస్ మోపెడ్‌పై అర్సపల్లి నుంచి వెళ్తుండగా అతివేగంగా వచ్చిన ఐచర్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గౌస్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆరో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతోసహా పారిపోవడంతో ఎస్సై-2 మొగులయ్య డ్రైవర్‌ను వెంబడించి పట్టుకున్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకట్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

నవీపేట, సెప్టెంబర్ 6: పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన కొండూరు సాయిరాం(26) రెండేండ్లుగా మద్యానికి బానిసై మతి స్థిమితం లేక అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది గతనెల 30న పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు కొండూరు మహిపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఆవులు చోరీ

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 6 : జిల్లాకేంద్రంలో దుండగులు మూగజీవులను టార్గెట్ చేస్తూ వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. వారం రోజుల క్రితం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోదాంలో నుంచి దుండగులు 18 మేకలను ఎత్తుకెళ్లిన ఘటన మరువక ముందే గురువారం అర్ధరాత్రి నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు ఆవులను ఎత్తుకెళ్లారు. నాల్గో టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సూర్యనగర్‌కు చెందిన హరీశ్ తన ఆవులను ఎప్పటిలాగే గురువారం సాయంత్రం కొట్టంలో కట్టేశాడు. శుక్రవారం ఉదయం కొట్టంలో చూడగా రెండు ఆవులు కనిపించలేదు. చట్టుపక్కల వెతికినా వాటి ఆచూకీ లభించకపోవడంతో నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

PUBLIC NOTICE
General public are hereby informed that my client M/S. Shriram Finance Ltd, Armoor Branch, Dist. Nizamabad agreed to accord Loan to **Borrower: Mohammed Jakheer Hussain S/o. Mohammed Sabeer Hussain,** Age 41 Yrs, Occ:Business R/o. H.No.1-5-92/9/4/4, Zirayath Nagar, Armoor town and Mandal Nizamabad (Dist) on mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice.
SCHEDULE OF PROPERTY
Layout Plot No.21 (Part) in Survey No.401/38, in L.P.No. 31/81 admeasuring total site area of **Plot (24'-3" + 28'-6")/2x35'-0" =923.12 Sq.fts or 102.56 Sq.Yds or 85.76 Sq.Mtrs** situated at Armoor Proper and Mandal, Municipality Armoor, Mandal Parishad: Armoor, District and Zilla Parishad Nizamabad, Regn. District: Nizamabad and Registration Sub Dist Armoor.
Bounded as below : North: 30'-0" wide Road, **South:** House No.1-5-92/9/4/4 in Plot No.21 (Part), **East:** 30'-0" wide Road, **West:** Land of Others
Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subash Nagar, Nizamabad, Ph:98480 94409

PUBLIC NOTICE
General public are hereby informed that my client M/S. Shriram Finance Ltd, Armoor Branch, Dist. Nizamabad agreed to accord Loan to **Borrower: Arepally Chinna Sailu S/o. Chakali Arepally Malkanna,** Age 48 Yrs, Occ: Business R/o. H.No.7-100, Nadimigally, Balkonda Village & Mandal, Nizamabad (Dist) on mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice.
SCHEDULE OF PROPERTY
RCC Roof Residential Ground and First Floor Building bearing G.P.No.7-100, admeasuring total site area =2252.21 Sq.Fts or 250.24 Sq.yds or 209.23 Sq.Mtrs, RCC Roof Ground Floor Built up area = 1368.50 Sq.fts and RCC Roof First Floor Built up area = 400.00 Sq.fts situated at Balkonda Village and Mandal, Gram Panchayat Balkonda, Mandal Parishad Balkonda, District and Zilla Parishad Nizamabad, Regn. District: Nizamabad and Registration Sub Dist Armoor.
Bounded as below: North: Road, **South:** House of Chakali N.Poshani and Chinna Poshani **East:** House of Chakali Nadkuda Poshani, **West:** Open Cart Yard and House of Chakalu Sailu
Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subash Nagar, Nizamabad, Ph:98480 94409

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

అమ్రాద్ జడ్పీహెచ్‌ఎస్‌లో మట్టి వినాయకుల ప్రతిమలను విద్యార్థులకు అందజేస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

ఆర్మూర్‌లో మట్టి గణపతులను అందజేసిన మంగిరాములు మహరాజ్

మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

నందిపేట్‌లో మట్టి గణపతులను అందజేస్తున్న ఎస్సై హరిబాబు

రెంజల్‌లో ఎస్సై సాయన్న..

నగరంలోని విజయ్ హైస్కూల్‌లో..

బోధన్‌లో లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో

బోధన్/ నందిపేట్/ మాక్లూర్/ రెంజల్/ ఆర్మూర్‌టౌన్/ సుభాష్‌నగర్/ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 6: బోధన్ పట్టణం అంబేద్కర్ చౌరస్తాలోని అంకు టవర్స్‌లో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్, ఆచన్‌పల్లిల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి, లయన్స్ గవర్నర్ పి. లక్ష్మి, తహసీల్దార్ విఠల్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. బోధన్ ఏఎంసీ చైర్మన్ అంకు సంధ్యదాము, కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ గంగా శంకర్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. నందిపేట్‌లో గణేశ్ మండపం నిర్వాహకులు తయారు చేయించిన మట్టి గణపతుల ప్రతిమలను ఎస్సై హరిబాబు అందజేశారు. మండపంలో వినూత్న రీతిలో 2000 కొబ్బరి కాయలతో భారీ గణనాథున్ని తయారుచేయడం బాగుందన్నారు. మాక్లూర్ మండలంలోని అమ్రాద్ జడ్పీహెచ్‌ఎస్‌లో 250 మట్టి గణపతులను విద్యార్థులకు డీఈవో దుర్గాప్రసాద్ అందజేశారు. పాఠశాలలో పనిచేసే డ్రాయింగ్ టీచర్ రమేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణలో భాగంగా 15 రోజుల నుంచి 250 మట్టి వినాయకులను తయారు చేయించారు. 25 మంది విద్యార్థులు పాల్గొనగా వారికి సర్టిఫికెట్లతో పాటు జ్ఞాపికలను డీఈవో అందజేశారు. రెంజల్‌లోని సరస్వతీ కాలనీలో గౌరీసుత గణేశ్ మండలి వారు తయారు చేయించిన మట్టి గణపతులను ఎస్సై సాయన్న పంపిణీ చేశారు. మండప నిర్వాహకులు శ్రీరాం గంగాధర్, అనిల్, నాగరాజు, మోహన్, శ్రావణ్‌కుమార్, ఎల్లప్పా, పోశెట్టి, ఆనంద్ పాల్గొన్నారు. ఆర్మూర్‌తో ఓ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తయారు చేయించిన మట్టి గణపతుల మంగిరాములు మహరాజ్, అగ్గు స్వామి మహరాజ్, మున్సిపల్ కమిషనర్ రాజు పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు. లక్ష్మీబాయి-విఠల్‌గుప్తా చారిట్రబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తన స్వగృహంలో గణేశ్ మండపాలకు ఆర్థిక సహకారం, మట్టి గణపతులను పంపిణీ చేశారు. నగరంలోని విజయ్ హైస్కూల్‌లోని 8వ తరగతి విద్యార్థులు మట్టితో గణపయ్యలను పాఠశాల ప్రాంగణంలో తయారు చేశారు. 'మట్టి గణపతులను పూజించండి – పర్యావరణాన్ని కాపాడండి' నినాదంతో భాగంగా టీచర్లు రేఖ, స్రవంతి ఆధ్వర్యంలో వీటిని తయారు చేసినట్లు కరస్పాండెంట్ ప్రభాదేవి తెలిపారు.

హెడ్ కుక్ కోసం ఇంటర్వ్యూలు

రెంజల్, సెప్టెంబర్ 6: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో హెడ్ కుక్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం మండల స్థాయి అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. తొమ్మిది మంది హాజరు కాగా వారితో వంటలు వండించారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వారి అనుభవం, వంటపై అవగాహన, వంటల రుచులను పరిశీలించామని అన్నారు. ఎంపికైన వారి పేరు త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలోఎంపీడీవో వెంకటేశ్ జాదవ్, ఎంఈవో గణేశ్‌రావు కులకర్ణి, ఎస్‌వో శ్యామల పాల్గొన్నారు.

గోమాతకు అంత్యక్రియలు

బోధన్ రూరల్, సెప్టెంబర్ 6: ఎరాజ్‌పల్లి గ్రామంలో శుక్రవారం హనుమాన్ మందిరానికి చెందిన ఆవు మృతి చెందడంతో గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ధర్మోరాలో రాజేందర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మోర్తాడ్/ వేల్పూర్/ భీమ్‌గల్, సెప్టెంబర్ 6: నియోజకవర్గంలోని పలు బాధిత కుటుంబాలను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మోర్తాడ్ మండలం వడ్యాట్ గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ మహేశ్ తల్లి ఇటీవల కాలం చేయడంతో బాధిత కుటుంబాన్ని, ధర్మోరా గ్రామానికి చెందిన మిట్టపల్లి రాజేందర్‌కు ఇటీవల హార్ట్ సర్జరీ కావడంతో ఆయనను ఎమ్మెల్యే పరామర్శించారు. ధర్మోరా గ్రామానికి చెందిన సాగర్ అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల సాయం అందించారు. వేల్పూర్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుడు ప్రవీణ్ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని, అదే గ్రామానికి చెందిన రాజేశ్ తండ్రి మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కోమన్‌పల్లి మాజీ సర్పంచ్ నవీన్ చేతికి శస్త్రచికిత్స కావడంతో ఆయను పరామర్శించారు. భీమ్‌గల్ మండలంలోనిని బడాభీమ్‌గల్, సికింద్రాపూర్, భీమ్‌గల్ గ్రామాలకు చెందిన పలు కుటుంబాలను ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

కంఠేశ్వర్, సెప్టెంబర్ 6 : జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు.. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. గోడౌన్‌కు వేసిన సీళ్లతోపాటు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తును కొనసాగిస్తుండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగించే ఆది దేవుడైన గణేష్ చతుర్థి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ఆనందోత్సహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఆర్థిక సాయం..

వేల్పూర్, సెప్టెంబర్ 6: మండల కేంద్రంలోని హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఎరుకల ఎల్లయ్యకు రూ. 5000 వేల ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వెన్న మురళి, ఉపాధ్యక్షుడు బాలసాయిలు, కార్యదర్శి మోహన్, ట్రెజరర్ బాల్‌రాజ్, సభ్యులు పాల్గొన్నారు. భీమ్‌గల్ మండలంలోని బాబాపూర్ గ్రామంలో ఎర్రొళ్ల సురేశ్ కుమారుడు ఎనిమిదేండ్ల బాబుకు అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం విశ్వహిందూ పరిషత్ భీమ్‌గల్ శాఖ నుంచి రూ.20,100 అందించారు.

డిచ్‌పల్లి దవాఖాన ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న పీవోడబ్ల్యూ నాయకులు

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 6 : మండలకేంద్రంలోని 30 పడకల దవాఖాన ఎదుట పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సంధ్యారాణి మాట్లాడుతూ.. ఈ ఏడాది వానకాలంలో సీజనల్ వ్యాధులతో అనేక మంది బాధపడుతున్నారని, కానీ దవాఖానలో వైద్య పరీక్షలు, మందులు అందుబాటులో లేవని ఆరోపించారు. పేదలు ప్రైవేట్ దవాఖానల్లో చూపించుకునే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అమూల్య, లత, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మురళి, సాయాగౌడ్, మోహన్, సాగర్, హేమాంజలి, స్వాతి, సుచిత్ర పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలి

వినాయక్‌నగర్/నవీపేట, సెప్టెంబర్ 6 : వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సిబ్బందికి సూచించారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్సైలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని గణేశ్ మండపాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు భద్రతా చర్యలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి రోజూ డే అండ్ నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ, మండపాల వద్ద నిఘా పెట్టాలని ఆదేశించారు. ప్రతి మండపం వద్ద పాయింట్ బుక్ ఏర్పాటు చేయించి, నైట్ బీట్ పెట్రోలింగ్ సిబ్బంది పాయింట్ బుక్కులో ఎంట్రీ చేయాలని ఆదేశించారు. గణేశ్ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్‌కుమార్ సూచించారు. నవీపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమన్వయ సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సై వినయ్, ఆర్‌ఐ నరేశ్, ఎంపీవో రామకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కందకుర్తి కార్యదర్శి సతీశ్ చంద్ర బదిలీ

రెంజల్, సెప్టెంబర్ 6: కందకుర్తి జీపీ కార్యదర్శి సతీశ్ చంద్ర బదిలీ అయినట్లు ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్ శుక్రవారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బోధన్ మండలం ఏరాజ్‌పల్లి గ్రామానికి డిప్యూటేషన్‌పై వెళ్లాడు. ఆయన స్థానంలో రెంజల్ జీపీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న భాస్కర్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం వారు ఆయా జీపీల్లో బాధ్యతలు స్వీకరించారు.

జాతీయస్థాయి ఉషూ పోటీలకు కేర్ కళాశాల విద్యార్థి

కంఠేశ్వర్, సెప్టెంబర్ 6 : మంచిర్యాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉషూ పోటీల్లో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలకు చెందిన బీకాం కంప్యూటర్స్ మూడో సంవత్సర విద్యార్థి షేక్ బిలాల్ ప్రతిభ కనబర్చాడు. పోటీల్లో బంగారు పథకాన్ని సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ తెలిపారు. షేక్ బిలాల్‌తోపాటు కోచింగ్ ఇచ్చిన వారిని ఘనంగా సన్మానించారు. ఈనెల 20న ఉత్తరాఖాండ్‌లో నిర్వహించే పోటీల్లో బిలాల్ పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ నరేశ్, ఇన్‌చార్జి సందేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘ కార్యవర్గం ఎన్నిక

కంఠేశ్వర్, సెప్టెంబర్ 6 : జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలోతెలిపారు. అధ్యక్షుడిగా చిన్నయ్య, ఉపాధ్యక్షుడిగా బుద్ధిరాజ్, ప్రధానకార్యదర్శిగా చంద్రవితల్, సంయుక్త కార్యదర్శిగా బి.గంగాధర్, కోశాధికారిగా ఎం.ఎ.ఖాలిక్ తదితరులను ఎన్నుకున్నట్లు వివరించారు.

బదిలీపై వెళ్లిన ఏవోకు సన్మానం

రుద్రూర్, సెప్టెంబర్ 6 : రుద్రూర్ ఏవోగా పనిచేసి ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లిన నగేశ్‌రెడ్డిని జడ్పీటీసీ నారోజి గంగారాం ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. రుద్రూర్, వర్ని, చందూర్, మోస్రా మండలాల వ్యవసాయ అధికారిగా ఏడేండ్ల పాటు ఉత్తమ సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో విండో మాజీ చైర్మన్ పత్తి రాము, అక్కపల్లి నాగేందర్, నాయకులు పత్తి లక్ష్మణ్, రైతుబంధు సమితి మండల మాజీ కన్వీనర్ సంగయ్య, మాజీ వైస్ ఎంపీపీ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ ఎస్సైకి..

సిరికొండ, సెప్టెంబర్ 6 : మండలానికి నూతనంగా వచ్చిన ఎస్సై ఎల్.రామ్‌ను హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ అయినాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఫౌండేషన్ ద్వారా సేవలు చేయడంపై యువకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు రాజేందర్, జీవన్, నవీన్ పాల్గొన్నారు.

నేడు మట్టి ప్రతిమల పంపిణీ

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 6: ఎడపల్లి మండల కేంద్రంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు పి.రాజలింగం ఆధ్వర్యంలో శనివారం మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేయనున్నారు. ఆయన ఎడపల్లిలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లు గుర్తించిన స్థానిక ఉద్యోగులతో 1984లో ఓ సంఘాన్ని ఏర్పాటు చేసి 1985లో రిజిస్ట్రేషన్ చేయించారు. నాటి నుంచి ఆయన సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. 2012లో ఉద్యోగ విరమణ పొందిన అనంతరం కాలక్షేపం కోసం తాను ఓ కార్యాలయాన్ని ప్రారంభించుకుని అక్కడి నుంచే సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో ఏటా దాదాపు 300 నుంచి400 వరకు మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలో వినాయకుల మట్టిప్రతిమలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు.

సంక్షిప్తంగా..

- **విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ-** డిచ్‌పల్లి, సెప్టెంబర్ 6 : మండలంలోని కోరట్‌పల్లి తండాలో ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సహకారంతో విద్యార్థులకు యూనిఫామ్స్‌ను ఉపాధ్యాయులు శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ, గ్రామస్తులు, యువకులు రెండేండ్లుగా పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ప్రారంభించి, ఇద్దరు విద్యావలంటీర్లను నియమించి వేతనాలు చెల్లిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.
- **ఇసుక టిప్పర్ పట్టివేత -** కోటగిరి, సెప్టెంబర్ 6 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. పోతంగల్ ఇసుక లోడ్ చేసుకొని కోటగిరి మీదుగా బోధన్ తరలిస్తుండగా కోటగిరి-సులేమాన్‌ఫారం మధ్య టిప్పర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు తెలిపారు. టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చామని ఎస్సై తెలిపారు.
- **వడ్డేపల్లి కృష్ణ మృతి బాధాకరం -** సుభాష్‌నగర్, సెప్టెంబర్ 6 : ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ మృతిబాధాకరమని జిల్లా ప్రముఖ కవులు రచయితలు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీతారాంనగర్ కాలనీలో ప్రముఖ కవి వీపీ చందన్‌రావు ఆధ్వర్యంలో వడ్డేపల్లి కృష్ణ సంతాప సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాసర్ల నరేశ్‌రావు, నాళేశ్వరం శంకరం, సమత, ధనుంజయ్, సుజాత, పింగళ్లి గంగాధర్‌రావు, మోహన్‌రాజు, ఎస్ఎస్ కుమారశర్మ పాల్గొన్నారు.
- **ఘనంగా కాళోజీ జయంతి -** ధర్పల్లి, సెప్టెంబర్ 6 : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని ప్రిన్సిపాల్ జ్యోతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కాళోజీ నారాయణరావు – జీవన ప్రస్థానం అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులకు మట్టి గణపతుల తయారీ, పర్యావరణ సంరక్షణపై ఎన్ఎస్ఎస్ యూనిట్, ఈకో-క్లబ్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాం, డాక్టర్ రవిరాజ్, డాక్టర్ కుమారస్వామి, కె.గంగాధర్, సంజీవ్, సరిత, సరళ, సంధ్య, శారద, పద్మ తదితరులు పాల్గొన్నారు.
- **అర్గుల్‌లో వారసంత ప్రారంభం -** జక్రాన్‌పల్లి, సెప్టెంబర్ 6 : మండలంలోని అర్గుల్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వారసంతను మాజీ సర్పంచ్ గొర్త రాజేందర్ శుక్రవారం ప్రారంభించారు. కూరగాయల మార్కెట్‌ను అందుబాటులో ఉండాలని వారసంతను ప్రారంభించామని, ప్రతి శుక్రవారం నిర్వహించే సంతను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
- **స్వయం పరిపాలన దినోత్సవం-** సిరికొండ, సెప్టెంబర్ 6 : మండలంలోని సత్యశోధక్ పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఛాత్రోపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ చూపిన వారికి ప్రిన్సిపాల్ నర్సయ్య బహుమతులు అందజేశారు.
- **గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి -** ఇందల్వాయి, సెప్టెంబర్ 6 : గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై మనోజ్‌కుమార్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. వినాయక మండపాల ఏర్పాటు, శోభాయాత్రలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నిబంధనల ప్రకారం ఉత్సవాలను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు.
- **జిల్లాకు ఇండోర్ స్టేడియం మంజూరు ఘనత అర్బన్ ఎమ్మెల్యేదే..–** వినాయక్‌నగర్, సెప్టెంబర్ 6 : జిల్లాకు ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ ట్రాకుల మంజూరు ఘనత అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణకే దక్కుతుందని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి న్యాలం రాజు అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ నాయకులు స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాలనుకున్న స్థలంలో కాంగ్రెస్ నాయకులు వారి పార్టీ కార్యాలయం నిర్మించాలని చూసిన దుర్మార్గులని ధ్వజమెత్తారు. జిల్లాలో సరైన స్టేడియం, కోచ్‌లు లేకున్నా జిల్లాకు చెందిన పలువురు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని అర్బన్ ఎమ్మెల్యే.. అసెంబ్లీలో ప్రస్తావనను లేవనెత్తారని గుర్తుచేశారు.
- **గోవుకు అంత్యక్రియలు - చ**ందూర్, సెప్టెంబర్ 6 : మండలంలోని మేడ్‌పల్లి తండాలో దుర్గామాతకు వదిలిన గోవు శుక్రవారం మరణించింది. గోమాతకు గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు.
- **విద్యార్థికి దుస్తుల అందజేత-** ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్6: మండలంలోని మంథని గ్రామంలో తల్లిదండ్రి లేని నిరుపేద విద్యార్థికి ప్రధానోపాధ్యాయుడు బాలరాజు సొంత డబ్బులతో రెండు జతల డ్రెస్సులు, షూస్, పెన్నులు శుక్రవారం అందజేశారు. దాతలు సాయం అందించాలని కోరారు.
- **నేటి నుంచి గణపతి ఉత్సవాలు -** బోధన్, సెప్టెంబర్ 6: పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు శనివారం ప్రారంభమవుతాయని సార్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కందుకాల శ్రీకాంత్‌గౌడ్, తాడు మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 7న శ్రీ చక్రేశ్వర శివమందిరంలో ఉదయం 10.26 గంటలకు వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారని తెలిపారు. పట్టణంలోని ఆయా మండపాల్లో ఈనెల 17 వరకు పూజలు నిర్వహించి అదే రోజు సాయంత్రం 4.21 గంటలకు వినాయక నిమజ్జన శోభాయాత్ర ప్రారంభమవుతుందని వివరించారు.

రైతులకు పంట రుణాలు అందజేత



రైతులకు రుణాలకు చెక్కులు అందజేస్తున్న చైర్మన్ అశోక్

మాక్లూర్, సెప్టెంబర్ 6: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 48 మంది పాత వారికి రూ.42 లక్షల 67 వేలు, 22 మంది కొత్త సభ్యులకు రూ.12 లక్షల 22 వేల పంట రుణాలు మంజూరయ్యాయి. రుణాల చెక్కులను పీఏసీఎస్ చైర్మన్ బుర్రోల్ల అశోక్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, సంఘ సెక్రటరీ ప్రవీణ్, పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం -** భీమ్‌గల్, సెప్టెంబర్ 6: రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా గురువారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సతీశ్‌ను అధ్యాపకులు శుక్రవారం సన్మానించారు.
- **క్రిమీలేయర్ విధానాన్ని అమలు చేయాలి-** ముప్కాల్, సెప్టెంబర్ 6: ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమీలేయర్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దళిత వికాస సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న పాదయాత్ర శుక్రవారం ముప్కాల్‌కు చేరింది. ఎస్సీ సంఘ సభ్యులతో దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్దార్థ మాట్లాడుతూ.. ఈ నెల 1న ఆదిలాబాద్ జిల్లాలో మొదలైన పాదయాత్ర నిజామాబాద్ జిల్లాలోకి ప్రవేశించిందని అన్నారు. కార్యక్రమంలో దళిత వికాస సమితి సభ్యులు సాయికుమార్, గంగారాం, శ్రీకాంత్ ,రమేశ్, కార్తిక్, రాజన్న పాల్గన్నారు.
- **ఫ్రైడేడ్రైడే తనిఖీ -** ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్6: పట్టణంలోని యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- **మోర్తాడ్‌లో ఫ్రైడే డ్రైడే-** మోర్తాడ్, సెప్టెంబర్ 6: మండల కేంద్రలో శుక్రవారం ఆరోగ్య విస్తరణ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఫ్రైడేడ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటి వెళ్లి కుండీల్లో నిల్వ ఉంచిన నీటిని పరిశీలించారు. దోమల లార్వా ఉందోలేదో చూశారు. ప్రతి శుక్రవారం నీటి పాత్రలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.
- **బోధన్‌లో భారీ వర్షం-** శక్కర్‌నగర్, సెప్టెంబర్6: బోధన్ పట్టణంలో శుక్రవారం సాయంత్రం రెండు గంటల పాటు భారీ వర్ష కురిసింది. రెండురోజులు తెరిపి ఇచ్చిన వర్షం మరో మారు కుండపోతగా కురిసింది. శనివారం వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభించుకోవాల్సి ఉండగా, మండపాల నిర్వాహకులకు కొంత ఇబ్బందిని కలిగించింది.
- **ఉపాధ్యాయులకు సన్మానం -** బోధన్ రూరల్, సెప్టెంబర్ 6: సాలూర మండలంలోని హున్సా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు డిప్యుటేషన్ పై వచ్చిన ఉపాధ్యాయులను బోధన్ ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్ సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు పాఠశాలకు డిప్యూటేషన్‌పై ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించారని తెలిపారు. విద్యార్థులు ఫుడ్ పెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆమ్మ ఆదర్శ పాఠశాలల చైర్ పర్సన్ రుక్మిణి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.
- **సైన్స్‌ల్యాబ్ పనులకు భూమిపూజ-** మోర్తాడ్, సెప్టెంబర్ 6: దొన్కల్ గ్రామంలో శుక్రవారం సైన్స్‌ల్యాబ్ నిర్మాణం పనులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముత్యాల రాములు భూమిపూజ చేశారు. దొన్కల్‌లో సైన్స్‌ల్యాబ్ నిర్మాణం కోసం రూ.13.50లక్షలు ముత్యాల సునీల్‌కుమార్ మంజూరు చేయించారని చెప్పారు.
- **వక్ఫ్‌బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలి -** శక్కర్‌నగర్, సెప్టెంబర్ 6: కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలని జమాతే ఇస్లామీ హింద్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బోధన్ పట్టణంలో శుక్రవారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.
- **ఉప్లూర్‌లో వైద్యశిబిరం-** మోర్తాడ్, సెప్టెంబర్ 6: కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఏఎన్ఎం అరుణకుమారి, అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆశకార్యకర్తలు రాధ, వినీల, శాంత, తిరుమల పాల్గొన్నారు.
- **కెనల్‌పై కబ్జాలను తొలగించాలి-** మాక్లూర్, సెప్టెంబర్: దాస్‌నగర్ డి-68 నిజాంసాగర్ కాల్వపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని కోరుతూ ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డు గంగాధర్ శుక్రవారం తసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాల్వను ఆనుకొని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు ఏర్పాటు చేశారని, కొందరు కాంప్లెక్స్‌లు నిర్మించారని అన్నారు. కబ్జాలను తొలగించి ప్రభుత్వ స్థలాలను కాపాడలని కోరారు.
- **కూలిన ఇల్లు పరిశీలన -** ముప్కాల్, సెప్టెంబర్ 6: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల కేంద్రానికి చెందిన కట్ట మహేశ్ ఇల్లు కూలి పోయింది. కూలిన ఇంటిని రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేశారు. తహసీల్దార్ పి.శ్రీకాంత్, ఆర్ఐ డి.రవి, ఏఆర్ఐ రాఘవేంద్ర రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.
NT-331758
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కొవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.